

బంగారు తాపడంతో మెరిసిపోతున్న శ్రీ సీతారాములు



శ్రీరామనవమికి తలంబ్రాలు సిద్ధం చేసిన మహిళలు



తలంబ్రాలు సిద్ధం చేసి ఊరేగింపుగా పలు ఆలయాలకు అందజేసేందుకు వెళుతున్న ఆలయ కమిటీ



శ్రీరామనవమికి ముస్తాబైన కొరిటెపాడు శ్రీరామమందిరం

కల్యాణానికి రాములోరి ముస్తాబు

రాములోరి కల్యాణానికి కొరిటెపాడు శ్రీరామ మందిరం ముస్తాబవుతోంది. కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. బంగారు తాపడంతో ఉత్సవమూర్తులు మెరిసిపోతున్నారు. కల్యాణ తలంబ్రాలను మహిళలు భక్తిశ్రద్ధలతో సిద్ధం చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

క్లుప్తంగా

నవయుగ వైతాళికుడు కందుకూరి



లక్ష్మీపురం: కుల, మత, వర్ణ, వర్గ విభేదాలు లేని ఆదర్శ సమాజం కోసం కృషి చేసిన సంఘ సంస్కర్త, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం తెలుగు వారందరికీ చిరస్మరణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కందుకూరి జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాటక రచయిత దర్శకుడు కావూరి సత్యనారాయణ, సాహితీవేత్త ముప్పాళ్ల ప్రసాదరావు, విద్యావేత్త ఈ.చంద్రయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కు పంపిణీ



పట్నంబజారు: ఇటీవల విజయవాడలోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ చెక్కును అందజేశారు. ఆర్మ్‌డ్ రిజర్వుడ్ హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు మృతి చెందారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్పీ తుషార్ డూడీ మంగళవారం శ్రీనివాసరావు భార్య బాలనాగమ్మకు చేయూత, ఫ్లాగ్ ఫండ్, విడో ఫండ్ కింద రూ. 1.75 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు అదనపు జిల్లా జడ్జిలకు సత్కారం



నగరంపాలెం : బదిలీపై వెళుతున్న జిల్లా అదనపు జడ్జిలు పి.వి.ఎస్.సూర్యనారాయణ, సీతారామకృష్ణారావు, బి.అర్చనలను మంగళవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో సత్కరించారు. మూడేళ్లపాటు పలు కేసుల్లో మంచి తీర్పు వెలువరించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి పార్థసారథి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, న్యాయవాదులు పాలడుగు వెంకటేశ్వర్లు, నందా రమేష, భరద్వాజ, శ్యామల పాల్గొన్నారు.

న్యాయవాది సత్యనారాయణ ప్రసాద్ మృతి



నగరంపాలెం: సీనియర్ న్యాయవాది పి.సత్యనారాయణ ప్రసాద్ (72) మంగళవారం మృతి చెందారు. శ్యామలానగర్‌లోని ఆయన నివాసంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. పలువురు న్యాయవాదులతో పాటు రమా పెయింట్స్ అధినేత బి.కన్న, మాజీ సర్పంచ్ సాంబిరెడ్డి, సహకార బ్యాంకు రిటైర్డ్ మేనేజర్లు గురువారెడ్డి, బి.ప్రసాద్, జి.శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు.

బీఎస్పీ పశ్చిమ అభ్యర్థిగా వాసు నియామకం



నెహ్రూనగర్ : పశ్చిమ నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చిరతనగండ్ల వాసు నియతులయ్యారు. 18న ఉదయం 10 గంటలకు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి భారీ ర్యాలీతో వెళ్లి, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన మంగళవారం తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, బీఎస్పీ నాయకులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం హౌసింగ్ బోర్డు కాలనీలో మాల్యాద్రి నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నాడు. ఈ సమయంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడిచేసి రూ. 1.68 లక్షల విలువ చేసే సిగరెట్లు స్వాధీనం చేసుకుని నల్లపాడు పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రిమినల్ కేసులున్న వారు ప్రకటనలు ఇవ్వాలి

నగర కమిషనర్, తూర్పు ఆర్వో కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై క్రిమినల్ కేసులుంటే వారు తగిన వివరాలతో న్యూస్ పేపర్, టెలివిజన్ లలో మూడుమ దఫాలుగా ప్రకటనలు ఇవ్వాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారంఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, పశ్చిమ నియోజకవర్గ ఆర్వో, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభ్యర్థులు తమ నామినేషన్ ఓకే అయిన తర్వాత ఉపసంహరణ గడువు ముగింపు అనంతరం పేపర్, టీవీల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్‌కి ఒక్కరోజు ముందు అభ్యర్థి తప్పనిసరిగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలని తెలిపారు. నామినేషన్ ఫారాలతో పాటుగానే నిర్దేశిత డాక్యుమెంట్స్ జత చేయాలని సూచించారు. నామినేషన్ ఫారాలను పూర్తి చేసేప్పుడు ఏ సందేహాలున్నా జీఎంసీలోని హెల్ప్ డెస్క్ లను సంప్రదించాలని తెలిపారు. నామినేషన్లు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తీసుకుంటారని వెల్లడించారు. నామినేషన్ వేసిన రోజు నుంచే అభ్యర్థి ఖర్చులు లెక్క వేస్తామని తెలిపారు. సమావేశంలో ఏఆర్వో సునీల్, ఏఈఆర్వో ప్రదీప్ కుమార్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మ, కె.దివాకర్ రెడ్డి, డి.జానిబాబు (వైఎస్సార్ సీపీ), సీహెచ్.వాసు (బీఎస్పీ), డి.బాలస్వామి , (కాంగ్రెస్) ఖాసిం షాహిద్ (సీపీఎం) పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు జీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాట్లు చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి కమిషనర్ చాంబర్‌లో, పశ్చిమ నియోజకవర్గానికి సిటీప్లానర్ చాంబర్‌లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు తీసుకుంటారని ఆమె తెలిపారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు ఈ నెల 18 నుంచి 25 వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు తీసుకుంటామని, సెలవు రోజుల్లో తీసుకోబోమని వెల్లడించారు. నామినేషన్ ఫారాలు తీసుకునే సమయంలోనే ప్రతి ఒక్కరికీ చెక్ లిస్టు ఇస్తున్నామని, అందుకు తగిన విధంగా పూర్తి చేసి ఇవ్వడం ద్వారా రిజెక్ట్ కాకుండా ఉంటాయని తెలిపారు. 26న నామినేషన్లు పరిశీలన చేస్తామని, ఉపసంహరణకు చివరి తేదీ 29 అని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు.

జగనన్న గెలుపును ఏ శక్తులు ఆపలేవు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి రజని. చిత్రంలో ఎమ్మెల్యేలు రోశయ్య, గిరి తదితరులు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

పట్నంబజారు: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, దాడులు చేసినా జగనన్న మళ్లీ సీఎం కావడాన్ని ఏ శక్తులూ ఆపలేవని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు 29వ డివిజన్ హౌసింగ్ బోర్డుకు చెందిన షేక్ బాలీషా నివాసంలో మంగళవారం ఉదయం జరిగిన ఆత్మీయ సమావేశానికి మంత్రి రజిని, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు నూర్‌బాషా సంఘం నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ రజిని కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంకటప్పయ్య కాలనీకి చెందిన షేక్ మౌలాలి, షేక్ హుస్సేన్ గుజ్జనగుండ్లకు చెందిన షేక్ శ్రీను, రహీం, కరీముల్లా, షేక్ మాబు సుభాని తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీలో చేరనున్న 500 వడ్డెర కుటుంబాలు

శ్యామలా నగర్‌లోని మంత్రి రజిని నివాసంలో నల్లకుంట 29వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకుడు, వడ్డెర సంఘం నాయకుడు గోగుల వెంకటేశ్వరరావు మంత్రిని కలిసి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్లుగా తెలుగుదేశం పార్టీని నమ్ముకుని ఉన్నామన్నారు. ఆ పార్టీలో తమకు ఎటువంటి న్యాయం జరగలేదని తెలిపారు. సీఎం జగన్ పాలనలో తామందరికీ అన్ని సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. త్వరలో తన ఆధ్వర్యంలో 500 వడ్డెర కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరనున్నాయని తెలిపారు. మంత్రి రజిని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అంటేనే పేదల పార్టీ అని పేర్కొన్నారు. పేదలంతా మూకుమ్మడిగా పార్టీని బలపరుస్తున్నారని, మళ్లీ అధికారంలోకి రానున్నదని ఆమె చెప్పారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా వలసలు

టీడీపీ, జనసేన నుంచి 400 కుటుంబాలు చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యేలు కిలారి, ముస్తఫా, ఎమ్మెల్సీలు మర్రి, చంద్రగిరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా, అభ్యర్థి నూరిఫాతిమా

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గంలో 13వ డివిజన్ వడ్డెరగూడెంలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాస్, నాగ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన 400 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి రోశయ్య, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా మాట్లాడుతూ అందరికీ మేలు చేసిన వై.ఎస్.జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ టీడీపీ కూటమిపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలంతో గ్రామస్థాయికి పాలన చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతోందని తెలిపారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ కచ్చితంగా రాష్ట్రంలో సంక్షేమ సారథి వై.ఎస్.జగన్ పాలన రావడం తథ్యమని స్పష్టం చేశారు. తమ ఇంటి బిడ్డగా తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ గులాం రసూల్, జియావుర్ రెహమాన్, మహేష్, దుర్గ, కోలా భవాని, మనోరంజని, నాగేశ్వరి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక అధికారులు

పట్నంబజారు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆ శాఖ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. పలు అపార్ట్‌మెంట్లు, నివాసాల వద్ద అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. వెల్‌కమ్ హోటల్‌లో అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం.క్యూ.జిలాని అధికారులతో కలిసి ఎగ్జిబిషన్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పొన్నూరు రోడ్డు, సంగడిగుంట ప్రాంతాల్లో గుంటూరు –2 అగ్నిమాపక అధికారులు ఫైర్ డెమో నిర్వహించారు. వాల్‌పోస్టర్లు అతికించడంతో పాటు, ప్రజలకు కరపత్రాలు అందజేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య బలోపేతంలో యువత పాత్ర కీలకం




మాట్లాడుతున్న లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్ బాలాజీ శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్య బలోపేతంలో విద్యార్థులు, యువతే కీలక భూమిక పోషించాలని లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలు, ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశంలో 60 శాతం పైగా ఉన్న యువత, విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని తెలిపారు. రాబోవు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో యువత విజ్ఞతతో వ్యవహరించి, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. లెట్స్ ఓట్ సంస్థ జాతీయ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిందని తెలిపారు. రాజకీయాల కతీతంగా నూరు శాతం ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రజల్ని చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థుల్ని దేశభక్తి, ప్రజాస్వామ్యం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు చైతన్య కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ఓటుహక్కు ప్రమాణ పత్రం చదివించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లెట్స్ ఓట్ సభ్యులు వేమూరి సోమయాజులు, మేడూరి రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఓఎస్డీ పి. సీతారామయ్య, ఎన్. హేమకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రెయిన్ .. బాడీకి మెయిన్ !

- ఆధునిక జీవనశైలితో మెదడుకు ముప్పు
- ఉద్యోగాల ఒత్తిడితో రక్తనాళాలు పగిలిపోయే ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- నిత్యం యోగా, వ్యాయామం, ధ్యానం చేయాలి



గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలితో మెదడు వ్యాధులు పెరిగిపోతున్నాయి. నేడు యువతలోనూ సమస్యలు కనిపిస్తుండటంపై డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వయస్సు మళ్లిన వారిలో కనిపించే పక్షవాతం, మెదడు సంబంధిత వ్యాధులు నేడు యువకుల్లోనే కనిపిస్తూ ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఒత్తిడితో మెదడు చిత్తు

ముఖ్యంగా టార్గెట్‌తో కూడిన ఉద్యోగాలు చేస్తున్న వారిలో, వ్యాపారుల్లో, ఒత్తిడితో చదువుతున్న విద్యార్థుల్లో తొలుత భరించలేని తలనొప్పి ప్రారంభమవుతుంది. నివారణ చర్యలు తీసుకోని పక్షంలో మెదడులో ఒత్తిడి పెరిగిపోయి, తర్వాత రక్తనాళాలు పగిలి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. 24 గంటలు కంప్యూటర్స్ ముందు పనిచేసేవారు, స్మార్ట్ ఫోన్స్ ఎక్కువగా వాడేవారు మెదడుకు కొంత విశ్రాంతి ఇవ్వాలి.

బ్రెయిన్ ద్వారానే అన్ని పనులు

మనిషి దైనందిన జీవితంలో అన్ని పనులు బ్రెయిన్ ద్వారానే జరుగుతాయి. జ్ఞానేంద్రియాలకు ఇది ముఖ్యమైన కేంద్రం. మెదడు పనిచేయకపోతే మనిషి జీవచ్ఛవం కింద లెక్కే. శరీరంలోని కీలకమైన అవయవాలన్నీ ఇది ఇచ్చే ఆదేశాల ద్వారానే పనిచేస్తుంటాయి. కొన్ని వ్యాధులు, ప్రమాదాల్లో గాయపడి మెదడు దెబ్బతింటే ప్రాణానికే ప్రమాదం. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మెదడును జాగ్రత్తగా కాపాడుకోవాలని, లేనిపక్షంలో వ్యాధుల బారిన పడి జీవితాంతం బాధపడాల్సి వస్తుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.


మెదడుకు ఇబ్బందికర పరిస్థితులు ఇవి

ప్రమాదాల్లో తలకు గాయాలవ్వడం, పక్షవాతం, మెదడులో ట్యూమర్లు, పార్కిన్‌సన్స్ వ్యాధి, యాంగ్జైటీ, డిప్రెషన్ కారణాల వల్ల మెదడు దెబ్బతింటుంది. తలనొప్పి, వాంతులు అవడం, చూపులో తేడాలు, నడకలో తడబాటు, జ్ఞాపకశక్తి లోపించడం, ఏదైనా విషయాలపై ఏకాగ్రత చూపించలేకపోవడం, చెవిలో శబ్దాలు వినిపించడం, మనిషి అసాధారణంగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు కనిపిస్తే మెదడుకు ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయని గుర్తించాలి.

ట్యూమర్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

మెదడులో ఏర్పడే కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. ప్రమాదకరం కాని కొన్నింటిని ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. ట్యూమర్ ఉన్నవారిలో ఫిట్స్ వస్తాయి. వైద్యుల సలహా మేరకు మందులు వాడుతూ ఉండాలి. చేతులు, కాళ్లు పనిచేయకపోతే పక్షవాతం అని భావిస్తారు. బ్రెయిన్‌లో గడ్డ ఉండటం వల్ల కూడా ఇలా జరగవచ్చు. అన్ని వయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్‌లు వస్తాయి. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ ద్వారా వైద్యులు నిర్ధారిస్తారు.

బ్రెయిన్ సమస్యల బాధితుల వివరాలు



గుంటూరు జీజీహెచ్‌లో రోడ్డు ప్రమాదాల వల్ల తలకు గాయాలైన వారు, తలలో వివిధ రకాల గడ్డలు వచ్చిన వారు ప్రతిరోజూ 100 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. న్యూరాలజీ వైద్య విభాగంలో ప్రతిరోజూ 200 మంది వివిధ రకాల మెదడు సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. 2019లో ఓపీలో 4284 మంది, 2020లో ఓపీలో 2565 మంది, 2021లో ఓపీలో 2938 మంది, 2022లో ఓపీ విభాగంలో 2983 మంది, 2023లో ఓపీ విభాగంలో 3042 మంది, 2024 మార్చి వరకు 500 మంది చికిత్స పొందారు. గుంటూరు జిల్లాలో 50 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉన్నారు. వీరి వద్దకు ప్రతిరోజూ 20 నుంచి 30 మంది వివిధ రకాల మెదడు సంబంధిత సమస్యలతో వస్తున్నారు.

అందుబాటులో ఆధునిక వైద్యసేవలు



న్యూరో నేవిగేషన్, అల్ట్రా మైక్రోస్కోప్ లాంటి ఆధునిక ఆపరేషన్లతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకున్న వారు గతంలో కంటే చాలా మెరుగైన జీవితాన్ని గడపవచ్చు. ఈ వైద్యం ద్వారా నూటికి 90శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్స్‌లో నూటికి 10శాతం మాత్రమే ప్రాణాంతకమైనవి. ప్రజలకు వీటిపై చాలా అపోహలున్నాయి. అవగాహన తక్కువగా ఉంది. అన్ని ట్యూమర్లకు ఆపరేషన్లు చేయాల్సిన పనిలేదు. రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ, స్టెరాయిడ్స్, యాంటీసీజర్ మెడికేషన్ వైద్య విధానాల ద్వారా నయం చేయవచ్చు.

–డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్, న్యూరోసర్జన్, గుంటూరు


మెదడును జాగ్రత్తగా కాపాడుకోవాలి



వయస్సు పెరిగే కొద్దీ మెదడు రక్తనాళాలు పగిలి ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వృద్ధులు న్యూరాలజీ, న్యూరోసర్జన్స్‌ను సంప్రదించి మెదడు పనితీరు గురించి తరచూ తెలుసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఒత్తిడికి గురి కాకూడదు. నిత్యం యోగా, ధ్యానం, శారీరక వ్యాయామాలు చేయాలి. మద్య, ధూమపానాలకు దూరంగా ఉండాలి. చేపలు, గుడ్లు, తాజా పండ్లు తీసుకోవాలి. మెదడు నిరంతరం పదునుగా పనిచేసేలా పజిల్స్, నూతన విషయాలు నేర్చుకోవడం చేయాలి.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, సీనియర్ న్యూరాలజిస్ట్, గుంటూరు

వైఎస్సార్ సీపీకే ముదిరాజుల మద్దతు



మంత్రి విడదల రజనీని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ

నెహ్రూనగర్: ముదిరాజుల మద్దతు వైఎస్సార్ సీపీకే ఉంటుందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీని మంగళవారం ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి మద్దతు తెలియజేసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముదిరాజ్ సామాజిక వర్గాన్ని గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా విడదల రజినీకి అవకాశం కల్పించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. తిరిగి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసేలా ముదిరాజులంతా కృషి చేస్తామని తెలిపారు.